సీపీఆర్ పై ఉచిత శిక్షణ

- 25 ఏండ్లుగా శిక్షణ ఇస్తున్న గాంధీ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం
- ఈనెల 19 నుంచి 20 వరకు నిర్వహణ
- అనంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్న అధికారులు

సీపీఆర్ గురించి వివరిస్తున్న జీఎంసీ అలుమ్ని ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, జనవరి 17: గుండెపోటు వచ్చిన సమయంలో ప్రాణాలను కాపాడే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసిస్టేషన్) చేసే పద్ధతిపై సాధారణ పౌరులందరికీ ఉచిత శిక్షణ ఇస్తున్నామని గాంధీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు తెలిపారు. గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్ని అసోసియేషన్, జీఎంసీ గ్లోబల్ అలయెన్స్, అమెరికన్ హార్ట్ అసోసియేషన్, జనహిత సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 19, 20, 21వ తేదీల్లో గాంధీ దవాఖాన ఆవరణలోని అలుమ్ని భవనంలో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు. గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ లింగమూర్తి, డాక్టర్ రవీందర్ సురకంటి, డాక్టర్ మహేశ్వర్ పర్వత్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ డెన్నిస్ మెకాలే (చికాగో), జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధి నర్సింహమూర్తి మీడియాతో మాట్లాడారు. 2000 ఏడాది నుంచి ఇప్పటి వరకు 30 వేల మంది డాక్టర్లకు ఉచిత శిక్షణ ఇచ్చామని, 2018 నుంచి సాధారణ ప్రజల కోసం కమ్యూనిటీ సీపీఆర్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. రాబోయే మూడు రోజుల్లో ఐదు వేల మందికి శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. శిక్షణకు హాజరైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఆసక్తి గలవారు 81797 13704, 90631 82058లలో రిజిస్టర్ చేసుకొని, లేదా నేరుగా కూడా ఉచిత శిక్షణకు హాజరుకావొచ్చని వారు వివరించారు.

కిలో గంజాయి పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు ఇద్దరు నిందితుల అరెస్టు

గంజాయి విక్రేతలను అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

కవాడిగూడ, జనవరి 17: ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని దోమలగూడ దోబీఘాట్ ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తుండగా ఎస్టీఎఫ్టీ టీమ్, ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. మౌలాలీకి చెందిన యశ్వంత్, రామంతాపూర్‌కు చెందిన వంశీకృష్ణను పట్టుకుని తనిఖీ చేయగా 1కిలో 76గ్రాముల గంజాయి వారి వద్ద దొరికిందని ఎస్ఐ జ్యోతి తెలిపారు. నిందితుల వద్ద నుంచి గంజాయితోపాటు ద్విచక్రవాహనం, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని, వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న గాంధీ శిల్ప బజార్ మేళాలో భాగంగా శుక్రవారం సాయంత్రం నృత్యకారుల సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో నేహా సింగ్ శిష్యబృందం జానపద నృత్యాలతో అలరించారు. కోలాటం, బిహు, లంబాడి, ఓయిలాట్టం, ఉత్తరాఖండ్ జానపద నృత్యం, సంబల్పూరి, భాంగ్రా, కావడి చిందు అంశాలు ప్రదర్శించారు. - కొండాపూర్

వర్గీకరణ చేయకపోతే సర్కారుకు చావు డప్పే

రథయాత్రలో డప్పు వాయిస్తున్న మహిళలు, కళాకారులు

బొల్లారం, జనవరి 17: ఫిబ్రవరి 7న ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరుగబోయే వేల గొంతులు-లక్ష డప్పులు దండోరా సాంస్కృతిక మహ ప్రదర్శనను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర డప్పు కళాకారులు పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ జిల్లా నుంచి డప్పు కళాకారులు కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు పరిధిలోని ఆదర్శనగర్ నుంచి రథయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా డప్పు కళాకారులు ఆదర్శనగర్ బస్తీవాసులు, ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాయకుడు ఏపూరి సోమన్న మాట్లాడుతూ డప్పు చప్పుళ్లతోనే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకులను ఓడిద్దామని పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహంకాళీ శ్రావణ్ కుమార్ మాదిగ మాట్లాడుతూ ఫిబ్రవరి 7న వేల గొంతులు-లక్ష డప్పుల ప్రదర్శనకు మాదిగ సైన్యం లక్షలాదిగా తరలివచ్చి పాలకుల గుండెల్లో దరువులు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు డప్పు మల్లికార్జున్ మాదిగ, కంటోన్మెంట్ ఇన్‌చార్జి అజిత్ కళ్యాణ్, శ్రీకిషన్, దుబ్బ మురళి, ఈఆర్ బాల్‌రాజు, మిలిట్రీ రమేశ్, శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

బొల్లారం, జనవరి 17: నార్త్‌జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ శంకర్‌రాజు సంయుక్తంగా తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా సాఫీగా వెళ్లేలా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పాదాచారులు రోడ్డు దాటే క్రమంలో సహాయం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రతి రోజు ట్రాఫిక్ నియమాలు పాటించని వాహనదారులకు జరిమానాలు విధిస్తూ, చట్టప్రకారం కోర్టులో శిక్ష పడేలా చేస్తున్నామని, వారంలో 5 రోజులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ మద్యం సేవించి వాహనం నడిపిన వారికి చార్జీషీట్ ఫైల్ చేసి, లైసెన్సు రద్దు చేస్తున్నామని వెల్లడించారు. అదేవిధంగా జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మధుబాబు, ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలగిరి ట్రాఫిక్ పీఎస్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్, ఏసీపీ

గ్యార్వీ ఉత్సవాలకు హాజరైన తలసాని

బన్సీలాల్‌పేట్‌లో జరిగిన గ్యార్వీ ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే తలసాని

బన్సీలాల్‌పేట్, జనవరి 17: బన్సీలాల్‌పేట్ బండమైసమ్మ నగర్ డి-క్లాస్‌లోని మవులా అలీ చిల్లా వద్ద జరిగిన జరిగిన గ్యార్వీ ఉత్సవాలకు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. గ్యార్వీ నిర్వాహకులు ఆజమ్, రుక్ముద్దీన్, ఇమ్రాన్ ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం పేదలకు అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత, బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, నాయకులు కె.లక్ష్మిపతి, జావెద్, అన్వర్, ఫహీం, అబ్బాస్, ఆసిఫ్, ఆయుబ్, సిమా తదితరులు పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

ముషీరాబాద్ యాదవ సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, జనవరి 17: యాదవులు అన్నిరంగాల్లో రాణించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. నియోజకవర్గ యాదవ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే గోపాల్ ఆవిష్కరించారు. కవాడిగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముషీరాబాద్ యాదవ సంఘం నాయకులు పాశం అనిల్‌యాదవ్, బలరాంయాదవ్, వెంకటరమణ యాదవ్, మల్లికార్జున్‌యాదవ్, సత్యానారాయణయాదవ్, అశోక్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలంయాదవ్ పాల్గొన్నారు.

భోలక్‌పూర్ బాకారంలోని చారిత్రక భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రజలందరి సహాయ సహకారాలతో ఘనంగా ముగిశాయని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి అన్నారు. స్వామివారి జాతర మహోత్సవాలను ప్రశాంత వాతావరణంలో అత్యంత వైభవంగా నిర్వహించినందుకు స్థానిక నాయకులు తుమ్మరాజు, సురేశ్‌కుమార్, రాజు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో అంజిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నల్లవెల్లి ఊర్మిల, నాయకులు రామనందరెడ్డి, సతీష్‌రెడ్డి, అర్జున్‌యాదవ్, గోపాలకృష్ణ, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. - కవాడిగూడ, జనవరి 17:

రోడ్లపై మత పరమైన నిర్మాణాలు తొలగించాలి

సమావేశంలో మాట్లాడుతున్న భూపతి వెంకటేశ్వర్లు

చిక్కడపల్లి, జనవరి 17: నగరంలో రోడ్లపై మత పరమైన నిర్మాణాలను తొలగించాలని తెలంగాణ ప్రజా సాంస్కృతికి కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే), తెలంగాణ సిటిజన్స్ రైట్స్ అసోసియేషన్ సంయుక్తంగా శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో 533 గుడి, మసీదు, చర్చిలు, రోడ్లకు ఆటకంగా ఉన్నాయని వీటిని తొలగించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా జీహెచ్ఎంసీ కేవలం 26 మాత్రమే తొలగించారని తెలిపారు. ఈ విషయంలో జీహెచ్ఎం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. 114 శ్మశానవాటికలు, 357 రోడ్లను ఆక్రమణకు గురైనాయని తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయాల మూలంగా ఉదాసీనత కొనసాగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరీష్, జి.రాములు, కుల నిర్మూలన సంఘం అధ్యక్షుడు వహీద్, గంజి ఈశ్వర్, లింగం, సౌమ్య, జి.యాదగిరిరావు, భాస్కర్, శ్రీమన్నారాయణ, అరుణ, శారదదేవి, మహేశ్ దుర్గే పాల్గొన్నారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ

బంజారాహిల్స్, జనవరి 17: సంక్రాంతి పండుగకు ఊరెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లో చోరీ అయిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లోని దుర్గాభవానీనగర్ బస్తీలో నివాసం ఉంటున్న జి.రాధిక ఈనెల 11న ఇంటికి తాళం వేసి సంక్రాంతికి మహబూబాబాద్ జిల్లాలోని సొంతూరుకు వెళ్లింది. పండుగ పూర్తయిన తర్వాత తిరిగి ఇంటికి వచ్చి చూడగా.. తలుపులు పగుల గొట్టి కన్పించాయి. దీంతో లోనికి వెళ్లి అల్మారాలో చూడగా.. రెండు బంగారు గొలుసులు, 6 ఉంగరాలు, 6 జతల చెవి రింగుల తోపాటు కొన్ని వెండి వస్తువులు మాయమైనట్లు తేలింది. బాధితురాలు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువకుడు అదృశ్యం

మూసాపేట: మద్యం మత్తులో ఊరెళ్తున్నానని బయలుదేరిన యువకుడు అదృశ్యమైన ఘటన కూకట్‌పల్లి పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ కె.ముత్తు కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ఒల్లెపు సాయన్న 4న మూసాపేటలోని బంధువుల వద్దకు వచ్చాడు. వారు సైబర్ సిటీ మెరీనా స్కైస్ అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గా ర్డుగా పనికి కుదిర్చారు. 7న మద్యంతాగి ఊరు వెలుతున్న అని చెప్పి వెళ్లాడు. ఊరుకు చేరుకోకపోవడంతో.. తల్లిదండ్రులు, బంధువులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోయింది. తల్లిదండ్రులు శుక్రవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 87126 63145, 79898 83565 నంబర్లను సంప్రదించాలని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

ఉద్యమకారులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రపుల్ రాంరెడ్డి

చిక్కడపల్లి, జనవరి 17: వచ్చే బడ్జెట్‌లో ఉద్యమకారులకు నిధులు కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారులు జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చిక్కడపల్లిలో జేఏసీ నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ రానున్న మార్చి బడ్జెట్‌లో తెలంగాణ ఉద్యమకారులకు, అమరుల కుటుంబాలకు, కళాకారుల కుటుంబాల సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు 30వేల పెన్షన్, నాలుగు గదుల ఇళ్లు, 250 గజాల స్థలం హామీలు అమలు చేయాలని అన్నారు. వెంటనే ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రపుల్‌రాంరెడ్డి, వైస్ చైర్మన్ బత్తుల సోమన్న, గంటి చంద్రుడు, పి.యాదగిరి, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో ప్యాచ్‌వర్క్స

కవాడిగూడ, జనవరి 17: ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాల మేరకు శుక్రవారం బాపూజీనగర్‌లో జీహెచ్ఎంసీ అధికారులు సీసీరోడ్డు ప్యాచ్‌వర్క్ నిర్మాణ పనులను చేపట్టారు. ముషీరాబాద్ డివిజన్ పరిధిలోని బాపూజీనగర్‌లో రోడ్లు గుంతలమయమై అధ్వాన్నంగా మారాయని బీఆర్ఎస్ నాయకులు పూస గోరక్‌నాథ్, కె.బాబూరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి అధ్వాన్నంగా మారిన రోడ్లకు ప్యాచ్‌వర్క్స్ చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ అధికారులు బాపూజీనగర్‌లో పాడైపోయిన సీసీరోడ్డుకు పనులను చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు పూస గోరక్‌నాథ్, కె.బాబూరావు పనులను పరిశీలించారు.

పనులు పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ట్రాక్‌మెన్ సమస్యలపై మజ్దూర్ యూనియన్ ధర్నా

ట్రాక్‌మెన్ సమస్యలపై ధర్నా నిర్వహిస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

బన్సీలాల్‌పేట్, జనవరి 17: రైల్వే ట్రాక్‌మెన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. బోయిగూడలోని రైల్వే ఇంజినీరింగ్ సెక్షన్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన ప్రదర్శన అనంతరం వారు అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వే ట్రాక్ నిర్వహణ విభాగంలో ఉద్యోగాలను భర్తీ చేయాలని, మహిళలను ఇతర విభాగాల్లోకి మార్చాలని, పని ఒత్తిడి తగ్గించడానికి రెండు షిఫ్టుల విధానం అమలుచేయాలని, ట్రాక్‌మెన్ల జీతాలను పెంచాలని వారు డిమాండ్ చేశారు.

బాధ్యతగా వాహనాలు నడిపించాలి


వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బొల్లారం, జనవరి 17: నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని తిరుమలగిరి రవాణా శాఖ అధికారి ఎర్ర స్వామి అన్నారు. శుక్రవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను తిరుమలగిరి రవాణా శాఖ కార్యాలయంలో సిబ్బందితో కలిసి వాహనదారులకు కరపత్రాలు అందజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వెకిలిచేష్టలతో కొంతమంది వ్యక్తులు మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావొద్దని పేర్కొన్నారు. తప్పని సరిగా ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు హెల్మెట్ ధరించాలని తెలిపారు. కారు ప్రయాణంలో సీట్టు బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపరాదని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్ సకాలంలో రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జైచందర్, నరసింహస్వామి, నేహ, అవినాష్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి

బేగంపేట్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని బేగంపేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య సూచించారు. శుక్రవారం బేగంపేట్ ప్యారడైజ్ సీటీవో జంక్షన్ వద్ద నిబంధనలు పాటించని వాహనదారులకు వారు కౌన్సెలింగ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని దీంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు వాహనదారులు తప్పకుండా పాటించాలని సూచించారు. అనంతరం నిబంధనలు పాటించ వారిపై కేసులు నమోదు చేసి చలానాలు విధించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్సిటీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి వైస్ చాన్స్‌లర్ వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం వర్సిటీలో నిర్వహించిన క్యాంపస్ క్లీన్ కార్యక్రమాన్ని వైస్ చాన్స్‌లర్, రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. వైస్ చాన్స్‌లర్ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వర్సిటీ అవరణలోని క్లాస్ రూంలు, హాస్టల్స్, లైబ్రరీలు, ఇతర ప్రాంతాలను విద్యార్థులు బాధ్యత తీసుకొని శుభ్రంగా ఉంచాలని సూచించారు. వర్సిటీలో పరిశుభ్రతకు తరుచుగా క్యాంపస్ క్లీన్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

బాగ్‌లింగంపల్లిలో ఆపరేషన్ రోప్

చిక్కడపల్లి, జనవరి 17: రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్ పరిసర ప్రాంతాల్లో ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఫుట్‌పాత్ ఆక్రమణలు శుక్రవారం ట్రాఫిక్, జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది తొలగించారు. ట్రాఫిక్ డీసీపీ ఎ.అశోక్, అడిషన్ డీసీపీ రాందాస్ తేజావత్, ఏసీపీ ఎర్నా, జీహెచ్‌హెంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ పర్యవేక్షణలో చిక్కడపల్లి పోలీసుల బందోబస్తు నడుమ ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఆక్రమణలు తొలంచామని తెలిపారు. ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అబిడ్స్ ట్రాఫిక్ సీఐ రవికుమార్, చిక్కడపల్లి ట్రాఫిక్ ఎస్సై పెంటాగౌడ్, చిక్కడపల్లి ఎస్సైలు అభిలాష్, మోనిక బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనుమతి ఉన్నా తొలగించారు.

దివ్యాంగుడైన వెంకటేశ్ టీస్టాల్‌కు జీహెచ్ఎంసీ, కలెక్టర్ నుంచి అనుమతి ఉన్నా తొలగించారని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్(డీఎస్‌డీ) ఉపాధ్యక్షురాలు భారతి అన్నారు. నిరుపేదలైన వెంకటేశ్ జీవనాధారం పోయిందని అన్నారు. ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చడం అన్యాయం అన్నారు. ప్రభుత్వమే దివ్యాంగుడైన వెంకటేశ్‌కు జీవనాధారం చూపించాలని డిమండ్ చేశారు.